ప్రజాశక్తి
బుధవారం 17 ఏప్రిల్ 2024
I

అల్లూరి సీతారామరాజు

నిలిచిన బ్యాంకు సేవలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండల కేంద్రంలో యూనియన్ బ్యాంక్‌కు ఇంటర్నెట్ అంతరాయం కలగడంతో బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. మంగళవారం మండల కేంద్రంలో వారపు సంత కావడం, మరుసటి రోజు బ్యాంకు సెలవు కావడంతో ఆయా ప్రాంతాల గిరిజనులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు. బ్యాంకు సేవలు నిలిచి పోవడంతో చేసేదేమీ లేక తీవ్ర నిరాశతో వెనుదిగారు. కొంతమంది నగదు కోసం బయట పినో సేవలను ఆశ్రయించాల్సి వచ్చింది. బిఎస్‌ఎన్ఎల్ సిగ్నల్ లేక పోవడంతో అంతరాయం కలిగి సేవలు నిలిచి పోయినట్టు బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

ఇంటర్నెట్ లేదని ఏర్పాటు చేసిన బోర్డు

మన్యంలోని పివిటిజి గ్రామాల్లో ...

ఊట గెడ్డల నీరే దిక్కు!

▶▶ కానరాని తాగునీటి సౌకర్యం ▶▶ గెడ్డల్లోని కలుషిత నీటితో అనారోగ్యం
▶▶ పట్టించుకోని ప్రభుత్వాలు ▶▶ ఇదీ పివిటిజిల దుస్థితి

ఊటగెడ్డలో నీరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:

ఏజెన్సీ ప్రాంతంలోని మారు మూల గిరిజన గ్రామాల్లో సురక్షిత తాగునీరు కల్పిస్తున్నట్లు గత, ప్రస్తుత ప్రభుత్వాలు గొప్పలు చెప్పాయి తప్ప ఆచరణలో అమలు కాలేదు. అనేక మారుమూల పివిటిజి గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంతో గిరిజనులు సమీప పాలాల్లోని ఊట, పెదగెడ్డలు శరణ్యంగా మారాయి. కలుషితమైన నీటిని తాగడంతో గిరిజనులు పలు రకాల అనారోగ్యాలకు గురవుతున్నారు.

మండలంలోని కురిడి పంచాయతీ బలియాగుడ, గొందిగుడ పివిటిజి గ్రామాల్లో ఇప్పటివరకు తాగునీటి సౌకర్యం కల్పించ లేదు. బలియాగూడ మారుమూల పివిటిజి గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఉండగా, గొందిగూడ గ్రామంలో సుమారు 30 పివిటిజి కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో ఇప్పటివరకు తాగునీటి బోరు, గ్రావిటీ, బావిలు నిర్మించలేదు. దీంతో పివిటిజిలు గ్రామానికి సమీపంలోని పొలంలోని ఊట గెడ్డలను ఆశ్రయించి కలుషిత తాగునీటిని ఉపయోగిస్తున్నారు. బలియాగూడ గ్రామంలోని పొలంలోని ఊట గెడ్డ నుంచి వచ్చే నీటిని పివిటిజిలు ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత కారణంగా ఊట నీరు ఇంకిపోతోంది. దీంతో, పొలాల్లో గోతులు తవ్వి అందులో నుంచి వచ్చే నీటిని ఉపయోగిం చుకుంటూ దాహార్తిని తీర్చుకుంటున్నారు.

గోందిగూడ గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంతో ఆ గ్రామానికి సమీపంలోని పొలంలోని ఊట గెడ్డను ఆశ్రయించి తాగునీటిని ఉపయోగిస్తున్నారు. ఊటగెడ్డల నీరు కలుషితంగా ఉండటంతో ఆయా గ్రామాల్లోని గిరిజనులు టైఫాయిడ్, పచ్చకామెర్లు, కడుపునొప్పి వంటి వ్యాధులకు గురవుతున్నారు. ప్రస్తుతం కాస్తున్న ఎండల తీవ్రతకు ఊటగెడ్డ నీరు కూడా ఇంకి పోతుండటంతో గ్రామాల్లో తీవ్రమైన తాగునీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో సురక్షితమైన తాగునీటి సౌకర్యం కల్పించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా చర్యలు తీసుకోలేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత, ప్రస్తుత పాలక ప్రభుత్వాలు తాగునీటి సమస్యపై దృష్టి సారించ లేదు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో గ్రావిటీ పథకం నిర్మించి సురక్షితమైన తాగునీరు అందించాలని ఆదిమ జాతి గిరిజనులు కోరుతున్నారు.

ఊట గెడ్డలో నీటిని తోడుతున్న మహిళలు

స్ట్రాంగ్ రూమ్‌లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయ సునీత

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

అల్లూరి జిల్లా కలెక్టర్ విజయ సునీత

ప్రజాశక్తి-రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలు ప్రతిష్టాత్మకమైన భద్రత వలయంలో ప్రశాంతంగా నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ యం.విజయ సునీత పేర్కొన్నారు. స్థానిక గిరిజన బాలుర వసతి గృహంలో ఈవీఎంలు, వివి ప్యాడ్లు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమును, గిరిజన గురుకుల బాలికల జూనియర్ కాలేజీలో పోలింగ్ అనంతరం కౌంటింగ్ నిర్వహించే హాళ్లను, వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని సోమవారం రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంలో సీసీ కెమెరాలు ఏ విధంగా పనిచేస్తున్నాయో ఎప్పటికప్పుడు మోనిటర్‌లో పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి 399 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, 59 మంది సెక్టార్ అధికారులను, 73 మంది రూట్ అధికారులను నియమించామని చెప్పారు. ఈ నియోజకవర్గం పరిధిలో 518 ఈవీఎంలు, 518 వివి ప్యాడ్లు, 518 కంట్రోల్ యూనిట్లు, 518 బ్యాలెట్ యూనిట్లు అసెంబ్లీకి, పార్లమెంటుకు వేరువేరుగా వచ్చాయని, వాటిని ప్రతిష్టాత్మకమైన భద్రతతో స్ట్రాంగ్ రూములో భద్రపరచడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట తహశీల్దార్లు ఎ.కృష్ణజ్యోతి, నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్లు సత్యనారాయణ, చైతన్య, శ్రీధర్, విశ్వనాథం, శివ, సిఐ పి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్ రావు, సీనియర్ సహాయం టి.లక్ష్మణ్, ఇందిరా బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల పండుగ

-చందాల వసూలు
-ఆకట్టుకుంటున్న నృత్యాలు

ప్రజాశక్తి -అనంతగిరి: గిరిజన ప్రాంతంలో సాంప్ర దాయం ప్రకారం ఇటుకల పండుగను గిరిజనులు నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు నెల రోజులపాటు ఆచారం ప్రకారం పండగను నిర్వహించుకుంటారు. గిరిజనులు వారం రోజుల ముందు నుండి ఇంట్లో కావలసిన సామాగ్రితో పాటు రంగురంగులగా ముగ్గులతో అలంకరిస్తారు. కుటుంబ సభ్యులు అంతా కొత్త దుస్తులను ధరించి ఈ పండుగను భక్తి పూజలతో ఘనంగా నిర్వహించుకుంటారు. ఈ సందర్భంగా మహిళలు అరకు, అనంతగిరి ప్రధాన రహదారి గుండా టోల్ గేట్లను ఏర్పాటు చేసి వాహనదారులు, ప్రయాణికుల నుండి చందాలు వసూలు చేశారు. పురుషులు సాంప్రదాయ ఆయుధాలతో అడవిలో వేటకు వెళతారు. ఈ రకంగా పండుగను వారం నుండి పది రోజుల వరకూ థింసా నృత్యాలతో గ్రామాల్లో వచ్చి పోయే వారికి రంగు నీళ్ళ జల్లుతూ ఘనంగా నిర్వహించుకుంటారు. మహిళలు వసూలు చేసిన పజోరు (చంద) డబ్బులతో చివరి రోజు భోజనాలు ఏర్పాటు చేసుకుని గ్రామస్తులంతా భుజించుకుంటారు. పండుగ నెలరోజుల పాటు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంటుంద.

చందాలు వసూలు చేస్తున్న మహిళలు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ

తుపాను బాధిత మిర్చి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-విఆర్ పురం

తుఫాన్ కారణంగా మిర్చి పంట తీవ్ర నష్టం జరిగిందని, నేటికీ ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇవ్వలేదని, తక్షణమే పరిహారం చెల్లించాలని సిపిఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద మంగళవారం పంకు సత్తిబాబు అధ్యక్షతన మండల కమిటీ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా సభ్యులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ మిర్చి రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారని, తుపాన్ వల్ల జరిగిన నష్టంతో పాటు మార్కెట్‌లో ధర లేక అన్ని విధాలుగా రైతు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పరిహారం చెల్లించాలని కోరారు.

మానవత్వం చాటుకున్న సన్యాసమ్మ

-అనాథ పిల్లల ఇంటికి రేకుల వితరణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలానికి చెందిన అతిమరుమూల కుమడ పంచాయతీకి చెందిన సిర్లి మెట్ట గ్రామానికి చెందిన అనాథ పిల్లలైన వంతాల చిట్టిబాబు, వనిత, సంజనలను ముంచంగిపుట్టు గ్రామ నివాసి కిల్లో సన్యాసమ్మ మానవతా దృక్పథంతో తన సొంత నగదు ఎనిమిది వేల విలువగల సిమెంట్ రేకులను కొనుగోలు చేసి అందజేసింది.అనాథ పిల్లలకు ఆదుకోండి అనే శీర్షికతో పలు పత్రికల్లో కథనాలకు స్పందించి అనేక మంది దాతలు ముందుకు వచ్చారు. సన్యాసమ్మ తన వంతు చేతనైన సహాయం చేయాలనే సంకల్పంతో శిథిలావస్థలో ఉన్న గృహాన్ని చూసి సుమారు రూ.8000లతో గృహానికి సరిపడా సిమెంట్ రేకులను ఉచితంగా అందజేసింది.కప్పురేకులు అందజేసిన సన్యాసమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

పాత్రికేయుల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గిరిజన విలేకరుల సంఘం సీనియర్ పాత్రికేయులు కాంతారు మోహన్, కూడ మోహన్‌ల అధ్యక్షతన మంగళవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన విలేకరుల సంఘం (ఎపిటిఆర్ఏ) అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ ఆదేశాల మేరకు నూతన అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా కాంతారు మోహన్, అధ్యక్షుడిగా రెయ్యల నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా కూడ మోహన్, కోశాధికారిగా పాంగి భాస్కర్‌రావు లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గంపరాయి కోటిబాబు, కిల్లో ఈశ్వర్‌రావు, కూడ అనిల్, కిముడు రాంబాబు ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శిలు నాగభూషణం, కూడా మోహన్‌లు మాట్లాడుతూ, సంఘ సభ్యులందరి సహకారంతో విలేకరుల సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీలో అగ్ర భాగాన సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు తదితరులు

ప్రజాశక్తి - ఎటపాక

రంపచోడవరం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సలను గెలిపించాలని కోరుతూ మండలంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం జెండా ఊపి ప్రారంభించారు. ఎర్రగట్టు నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ నందిగామ, గౌరీదేవిపేట, లక్ష్మీపురం, గన్నవరం, తోటపల్లి, గొమ్ముకొత్తగూడెం, నెల్లిపాక, చోడవరం, రాయనపేట, గుండాల, పిచ్చుకలపాడు, కన్నయిగూడెం, ఎటపాక వరకు సాగింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ గిరిజన చట్టాలు, గిరిజన సమస్యల పట్ల సిపిఎం అభ్యర్థులకు పూర్తి అవగాహన ఉందని వారిని గెలిపించుకోవడం ద్వారా గిరిజన హక్కులు, చట్టాలను కాపాడుకోవచ్చని, పోలవరం నిర్వాసితులకు న్యాయం జరుగుతుందని చెప్పారు. వైసీపీ, టీడీపీ, బీజేపీ ఆదివాసీలకు ద్రోహం చేసే పార్టీలని, ఆ పార్టీలకు వేసే ఓట్లు గిరిజన హక్కులకు, చట్టలకు ఉరి తాళ్లు అవుతాయని తెలిపారు. టీడీపీ, వైసీపీ, బిజెపిలపై ప్రజలు విరక్తి చెందారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ప్రసన్న కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, నాయకులు ఆకిశెట్టి రాము, ఇరపా అజయ్, కాకా అర్జున్, సోయం వీరమ్మ, బుద్ధుల భద్రయ్య, సవలం రాము, హరనాథ్, కారం జయమ్మ, ఇరపా సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ నేతలను గెలిపించండి

రాజవొమ్మంగి : నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఉద్యమ నేతలను ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించాలని రాజవొమ్మంగి మండల ప్రజలకు సిపిఎం విజ్ఞప్తి చేసింది. సిపిఎం మండల సమావేశం పాండవుల సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు, చికిలింత సర్పంచ్ కోండ్ల సూరిబాబు మాట్లాడుతూ సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓట్లు వేసి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు మేలిన రమేష్, కాళ్ళ రాజుబాబు, దాసు, రాంబాబు, రమణ, టి. శ్రీను, రామరాజు, మల్లీశ్వరరావు, పలివెల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ వెంకటాపురం, అలివాగు, ఏడుగురాళ్లపల్లి గ్రామాలలో ముఖ్య కార్యకర్తల సమావేశాలు మంగళవారం జరిగాయి. ఇందులో పాల్గొన్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ మాట్లాడుతూ అమరజీవులు కుంజా బొజ్జి, సున్నం రాజయ్య, మడకం వెంకయ్య వంటివారు శాసన సభ్యులుగా, ఎంపిపిలు పని చేసి ఏజెన్సీలో వ్యవసాయం, విద్య, రహదారులు, ఇతర మౌలిక వసతులను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కాని విభజన అనంతరం ఈ పదేళ్లలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు, ఇక్కడ నుండి ఎన్నికైన ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య, సవలం దేవసయ్య, ముట్టం రాజయ్య, దిలీప్, కోశయ్య, కోవసి గంగయ్య, మడకం ఓమ్ తదితరులు పాల్గొన్నారు.

22న లోత రామారావు నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విఆర్.పురం : రంపచోడవరం నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి లోత రామారావు ఈనెల 22న నామినేషన్ వేస్తున్నారని, ఆ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సిపిఎం మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మండలంలోని రేఖపల్లి సిపిఎం కార్యాలయం వద్ద మంగళవారం పంకు సత్తిబాబు అధ్యక్షతన మండల కమిటీ సమావేశం, మండలంలోని పెద్ద మట్టపల్లిలో కారం సత్తిబాబు అధ్యకతన సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశాలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, సర్పంచ్ వెట్టి లక్ష్మి, నాయకులు కొంచెం నాగిరెడ్డి, కారం సుందరయ్య, వడ్లది రమేష్, నాయకులు తాతబాబు, రాంబాబు, సిహెచ్ సుబ్బారావు, తుర్రం బాబురావు, మోసం చందారరావు, సోడి మల్లయ్య, మిడియం సీతయ్య, పండా వెంకటేశ్వర్లు, వార్డు మెంబర్ చిక్కాల పద్మరావు, సోడి రామాశెట్టి, తుర్రం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు చూపుతున్న ఆదివాసీలు, సిపిఎం నాయకులు

ఎంపీ అభ్యర్థి అప్పలనర్స విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం

ప్రజాశక్తి -సీలేరు : అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ సిపిఎం మండల నాయకుడు శివరాత్రి నారాయణరావు ఆధ్వర్యాన వీధి మండలం లక్కవరపుపేట పంచాయితీ సంపంగి, ఎర్ర చెరువు గ్రామాల్లో మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై నిజాయితీగా పోరాడుతున్న సిపిఎం నాయకుడు అప్పలనర్సను రానున్న ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలిపించి చట్ట సభలకు పంపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటిపై ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు చట్టసభల్లో నోరు మెదపలేదని పేర్కొన్నారు. గిరిజనులకు న్యాయం జరగాలంటే సుత్తి కొడవలి నక్షత్రం గర్తుపై ఓటు వేసి సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు.



రాజీనామా పత్రాలు ఎంపిడిఒకు అందిస్తున్న వాలంటీర్లు

66 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన 66మంది గ్రామ వాలంటీర్లు మంగళవారం సామూహికంగా రాజీనామాలు చేశారు. మండలంలోని 19 పంచాయితీల పరిధిలో 269 మంది గ్రామ వాలంటీర్లు ఉండగా మంగళవారం నాటికి 66 మంది తమ రాజీనామాలను స్థానిక ఎంపీడీవో లోకల యాదగిరిశ్వరరావుకు అందజేశారు.

శ్రీరామగిరి కల్యాణోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని శ్రీరామగిరిలో జరగనున్న శ్రీసుందర సీతారామచంద్రస్వామి వారి శ్రీరామనవమి తిరు కళ్యాణ మహెూత్సవాల ఏర్పాట్లను విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, పలువురు నాయకులు మంగళవారం పరిశీలించారు. దేవాదాయ శాఖ, గ్రామపంచాయతీ అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంపిపి, జెడ్పిటిసి కోరారు. ప్రశాంత వాతావరణంలో సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పులి సంతోష్ కుమార్, ఉప సర్పంచ్ కొడిసెల దుర్గారావు, వివిధ పార్టీల నాయకులు పూనెం సత్యనారాయణ, సోయం చిన్నబాబు, ఫంకు సత్తిబాబు, కారం సుందరయ్య, సోడి మల్లయ్య, గుండెపూడి లక్ష్మణరావు, చీరపు తాతబాబు, రెడ్డి కాంతారావు, ఆలయ కమిటీ చైర్మన్ రేవు బాలరాజు, వైస్ చైర్మన్ చిన్న వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లును సమీక్షిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, జెడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి తదితరులు

రాజీనామా లేఖలను చూపుతున్న వాలంటీర్లు

వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-జి.మాడుగుల:మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామ వాలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 40మంది వరకు మూకుమ్మడిగా రాజీనామా చేసినట్లు వాలంటీర్ల యూనియన్ జిల్లా నాయకులు రాంబాబు, మండల నాయకులు సాగిని లక్ష్మన్ పడాల్, స్థానిక విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిస్వార్థంగా నిరుపేదలకు సేవలందిస్తున్న వాలంటీర్లపై కూటమి నేతలు ఈసీకి ఫిర్యాదు చేసి సేవలకు దూరం చేయడంపై మనస్థాపానికి గురయ్యామన్నారు ఈ కార్యక్రమంలో కొండబాబు, శోభన్, రాంబాబు, మహేష్, పేతురు బాబు,తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జీవిఎంసి 43వ వార్డులో 15 మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. అనంతరం ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు కలిసి వైసిపి విజయానికి కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పి.ఉషశ్రీ పాల్గొన్నారు.

'కాపులను మోసం చేసిన ప్రభుత్వం'

ప్రజాశక్తి-సీతమ్మధార : కాపులంతా కూటమి వైపు నిలబడాలని కాపు జెఎసి సభ్యులు ఆదిటి మహేష్, కాపు ఉద్యమ నేత ఆకుల రామకృష్ణ కోరారు. విశాఖ పౌర గ్రంథాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, కాపులను వైసిపి ప్రభుత్వం వంచించిందన్నారు. ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్ 5 శాతాన్ని అమలు చేయకపోవడం వల్ల కాపు విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కాపు సబ్సిడీ రుణం ఒక్కరికైనా ఇవ్వలేదని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ సర్వనాశనమైపోయాయన్నారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాలకు చెందిన వారంతా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుమ్మల సత్యారావు, ప్రగడ చిన నాగేశ్వరరావు, కర్రి వెంకటరమణ, సిరిసిపల్లి రమణ, మర్నెపీడు మణికంఠ, అన్నం వెంకట్రావు, తోట రామానుజం, గొల్లకోట సుబ్బారావు పాల్గొన్నారు.

శంకర్ ఫౌండేషన్ ఒకేషనల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-వేపగుంట : నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ వృత్తి విద్యా జూనియర్ కళాశాల విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులైన ఒకేషనల్ నర్స్, ఆప్తాల్మిక్ టెక్నీషియన్‌లో ఉత్తమ ఫలితాలను సాధించారని ప్రొఫెసర్ పి.కృష్ణప్రసాద్ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 95 శాతం, ద్వితీయ సంవత్సరంలో 95 శాతం ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు. మొదటి సంవత్సర పరీక్షలో డి.నాగాశ్యామల 534/600 మార్కులు, ద్వితీయ సంవత్సరంలో ఎకె.వహీదా 1163/1300 మార్కులు సాధించి కళాశాల, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తెచ్చారని పేర్కొంటూ అభినందనలు తెలిపారు. ఆసుపత్రుల్లో ఉద్యోగాలకు ఉపయోగపడే ఈ వృత్తివిద్యా కోర్సులకు శంకర్ ఫౌండేషన్ అధిక ప్రాధాన్యత ఇస్తుందని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ తెలిపారు.

21న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మండలం వేములపూడి ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-2025కు విద్యా సంవత్సరంకు సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సంధ్య తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, 21న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు తమ హాల్ టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

'యోగాతో దీర్ఘకాలిక వ్యాధులు దూరం'

ప్రజాశక్తి -నక్కపల్లి:యోగాసనాలతో అనేక దీర్ఘ కాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చునని, ప్రతీ ఒక్కరూ రోజూ కనీసం గంటన్నర యోగ, ప్రాణాయామం, ధ్యానం వంటి వాటికి కేటాయించాలని వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి యోగా ట్రైనర్ డి.రాంబాబు సూచించారు. నక్కపల్లికి సమీపంలో పలువురి కి యోగాసనాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా మంగళవారం పలు ఆసనాలపై శిక్షణ ఇచ్చారు.

గిరిజనులపై పోలీసుల దాడి అమానుషం

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండలంలోని అతి మారుమూల లక్ష్మీపురం పంచాయతీకి చెందిన సుత్తి గూడ గ్రామంలో గంజాయి పేరుతో అర్ధరాత్రి సమయంలో అమాయక గిరిజనులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని, దీనిని తీవ్రంగా ఖండిస్తు న్నామని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు, ఎస్సీ, ఎస్టీ అల్లూరి జిల్లా కమిటీ సభ్యులు చెండా లోహితాసుడు తెలిపారు. మండలంలో లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ గ్రామంలో ఈ నెల 6న ఆదివారం అర్ధరాత్రి ఓ మహిళలతో పాటు నలుగురు గిరిజనులపై గంజాయి పేరిట పోలీసులు దాడి చేసి గాయ పరిచిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు మంగళవారం సుత్తిగూడ గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. జరిగిన ఘటనపై బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోహితాసుడు మాట్లాడుతూ, అమాయక గిరిజనులను ఏమీ కూడా సమాచారం అడగకుండా దాడి చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. దీనిపై ఎస్సి, ఎస్టి కమిషన్, కలెక్టర్, ఎస్పీ లకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దాడి చేసిన పోలీస్ సిబ్బందిపై ఎస్సీ,ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ సభ్యులు పెనుమలి చిరంజీవి, బాధితులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజనులపై దాడిని ఖండిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

రూ.300 కూలి పొందేలా చూడాలి

ప్రజాశక్తి -అనకాపల్లిడెస్క్:ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన రూ.300ల వేతన కూలి పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డ్వామా పీడీ మణికుమార్ తెలిపారు. రాంబిల్లి మండలంలోని ఒమ్మవరం గ్రామ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీలకు తగు సూచనలు, సలహాలు అందించారు. వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.300 వేతన కూలి తగ్గకుండా అందరూ పని చేసుకోవాలని ఆయన సూచించారు. పనులతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడంతో పాటు వలస వెళ్లడానికి అవకాశం లేకుండా వీటిని వినియోగించుకోవాలన్నారు.రైతులకు ఉపయోగపడే వ్యక్తిగత పనులతో పాటు గ్రామ అభివృద్ధికి పలు రకాల పనులను గుర్తించి ప్రాధాన్యత ప్రకారం చేసుకోవాలని సూచించారు.చెరువుల అభివృద్ధితో పాటు పంట పొలాలకు రోడ్లు, జీడి మామిడి తోటల్లో కౌంటర్ ట్రెంచెస్, ఫారం పాండ్స్, పంట కాలువలు వంటి పలు రకాల పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇందుకు గుంతల పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఈసీ కామేశ్వరరావు, టిఎ బైరాగి సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వేసవిలో ప్రయాణీకుల అదనపు రద్దీని దృష్టిలో పెట్టుకుని, ఎస్ఎంవి బెంగళూరు, మాల్దా టౌన్ , సికింద్రాబాద్-సంత్రగచ్చి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని రైల్వే నిర్ణయించింది. 06565 ఎస్ఎంవి బెంగళూరు-మాల్దా టౌన్ ప్రత్యేక రైలు ఈనెల 17 నుండి జూన్ 26 వరకు ప్రతి బుధవారం సాయంత్రం 16.35 గంటలకు ఎస్ఎంవి బెంగళూరులో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.56 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. మరల 9.58 గంటలకు బయలుదేరి మరుసటి శుక్రవారం రోజు ఉదయం 7: 30 గంటలకు మాల్దా టౌన్ చేరుకుంటుంది. 06566 మాల్దా టౌన్, ఎస్ఎంవి బెంగళూరు ప్రత్యేక రైలు ఈనెల 20 నుండి జూన్ 29 వరకు ప్రతి శనివారం ఉదయం 8.50 గంటలకు మాల్దా టౌన్‌లో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 5.40 గంటలకు దువ్వాడ చేరుకొని మరలా 5.42 గంటలకు బయలుదేరి మూడవ రోజున సోమవారం తెల్లవారుజామున 3.00 గంటలకు ఎస్ఎంవి బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైళ్ళు ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, భువనేశ్వర్, కటక్, భద్రక్‌ల మీదుగా ప్రయాణిస్తాయి.

అలాగే 07221 సికింద్రాబాద్ - సంత్రాగచ్చి సమ్మర్ స్పెషల్ రైలు ఈనెల 20 నుండి జూన్ 29 వరకు ప్రతి మంగళ, శనివారాల్లో ఉదయం 6.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి, అదేరోజు రాత్రి 19:55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది మరల 19:57 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:25 గంటలకు సంత్రాగచ్చి చేరుకుంటుంది. 07222 సంత్రాగచ్చి - విశాఖపట్నం వేసవి ప్రత్యేక రైలు ఈనెల 21 నుండి జూన్ 30 వరకు ప్రతి బుధ, ఆదివారాల్లో మధ్యాహ్నం 12.20 గంటలకు సంత్రాగచ్చి నుండి బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 3.20 గంటలకు దువ్వాడ చేరుకొని, మరల 3.22 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 15.00 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్ళు నల్గొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అనకాపల్లి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, బలాజ్‌పూర్ రోడ్, భువనేశ్వర్, కటౌట్ ఖరగ్‌పూర్ మీదుగా ప్రయాణిస్తాయి.

నేరాలు ఘోరాలు

హాల్ టికెట్ ఇవ్వలేదని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -పిఎం పాలెం : ఫీజులు చెల్లించలేదని హాల్ టికెట్ నిలిపి వేయడంతో ఒక విద్యార్థిని తల్లి కళాశాల ఆవరణలో సెల్ఫీ వీడియోతో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన ఘటన పిఎం పాలెం సమీపంలోని సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి విద్యార్థిని తల్లి కథనం ప్రకారం... జివిఎంసి ఆరో వార్డు పరిధి పిఎం.పాలెం సమీపంలో ఉన్న సాంకేతిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈఈఈ మూడో సంవత్సరం జి.ఉమమహేశ్వరి చదువుతోంది. జగనన్న విద్యా దీవెన ద్వారా డిప్లమో కోర్సులో చేరింది. చాలా మంది విద్యార్థులకు జెవిడి నగదు రాలేదు. దీంతో ఈ విద్యార్థులు కళాశాలకు ఫీజులు చెల్లించలేదు. విద్యార్థులకు ఈ నెల 18వ తేదీ నుంచి పరీక్షలు ఉన్నాయి. కళాశాల యాజమాన్యం దీనిని అవకాశంగా తీసుకుని ఫీజు చెల్లించిన వారికే హాల్ టికెట్లు ఇస్తామని చెప్పడంతో చాలా మంది విద్యార్థులు అప్పులు చేసి ఫీజు చెల్లించి హాల్ టికెట్లు అందుకున్నారు. విద్యార్థిని జి.ఉమామహేశ్వరి కుటుంబం పేద వారు తల్లి కనకేశ్వరి మంగళవారం కళాశాలకు వచ్చి ప్రిన్సిపల్ కాళ్లమీద పడి బ్రతిమిలాడినా హాల్ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఫోన్ ద్వారా వీడియో తీసుకుంటూ 'నా చావుకు కళాశాల యాజమాన్యమే కారణమని' చెబుతూ అక్కడే ఉరివేసుకొని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించారు. దీంతో ఉమామహేశ్వరికి కళాశాల యాజమాన్యం హాల్ టికెట్ ఇచ్చింది.

వేర్వేరు చోట్ల

215 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-గొలుగొండ:తరలించడానికి సిద్దంగా ఉంచిన 207 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం డీఎస్పీ మోహన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. నర్సీపట్నం రూరల్ సీఐ హరి, ఎస్సైలు ఉపేంద్ర, రామకృష్ణల ఆధ్వర్యంలో కృష్ణదేవిపేట అల్లూరి పార్కు వద్ద మంగళవారం ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా వెళుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారని తెలిపారు. పార్కు సమీప ప్రాంతంలో తరలించడానికి సిద్దంగా గంజాయిని నిల్వలు ఉంచినట్లు తేలిందన్నారు. గంజాయిని స్వాదీనం చేసుకొని రోలుగుంట మండలం నాయుడుపాలెం గ్రామానికి చెందిన హరిబాబు, కొయ్యూరు మండలం డౌనూరుకు చెందిన సతీష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. వీరి వద్ద నుంచి ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చీడికాడ:మండలంలోని వరహాపురం గ్రామ శివార్లలో వాహనాల తనిఖీ చేస్తుండగా 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రెండు ద్విచక్ర వాహనాలపై ముగ్గురు వ్యక్తులు వస్తుండగా గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అవార్డు గ్రహీతలకు అభినందన

ప్రజాశక్తి-విశాఖపట్నం : క్రీడల్లో ప్రతిభ చూపిన ఆంధ్రవిశ్వవిద్యాలయం విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. రైఫిల్ షూటింగ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయి ఎంపికలకు వెళుతున్న ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని పి.జాయ్‌సి, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ఎమ్మెస్సీ-కంప్యూటర్స్ విద్యార్థి పి.ఎమ్మి రతన్‌లను వీసీ తన కార్యాలయంలో అభినందించారు. వీరిరువురు ఇటీవల హైదరాబాద్‌లో ఆదర్శ కళానిలయం నుంచి ఉగాది బంగారు నంది పురస్కారాలను అందుకున్నారు. అతి తక్కువ కాలంలో విద్యలో, క్రీడల్లో సమాన ప్రతిభను చూపుతూ రాణిస్తున్న విద్యార్థులను ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయిలో సైతం ప్రతిభ చూపి వర్సిటీకి మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్‌కె భట్టి, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.శ్రీనివాస రావు, విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎన్.విజయమోహన్, తదితరులు పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని వెంకటాపురం కొడవటిపూడిలో రోడ్డు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.1.67 కోట్లతో నిర్మిస్తున్న బిటి రోడ్డు నిర్మాణం పట్ల గ్రామస్తులు హర్షం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి జెఈ రెడ్డి మాట్లాడుతూ, వెంకటాపురం సబ్ స్టేషన్ నుండి విశ్వనాథపురం వరకు 8 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులు చేపడు తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

19న మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -సీలేరు : విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 19న శుక్రవారం జీకే వీధి మండలం సీలేరులో మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ మేనేజర్ ఎం.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సీలేరు ఏపీ జెన్కో కళ్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగు ఈ శిబిరాన్ని ఎపి జోన్‌కో, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం దృష్టి లోపాన్ని బట్టి శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తక్కువ ఖరీదుకే కళ్లద్దాలు సరఫరా చేయబడిన పేర్కొన్నారు. ఆపరేషన్లు అవసరమైతే విశాఖపట్నం తరలించి వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కంటి సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

రెస్క్యూ ఆపరేషన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రజాశక్తి-రంపచోడవరం : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ముసురుమిల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలియజేశారు. అలాగే నీటిలో ప్రయాణం చేసేటప్పుడు అందరూ విధిగా లైఫ్ జాకెట్స్, లైఫ్ బాల్స్ ఉపయోగించాలని సూచించారు. గ్యాస్ ఫైర్ అయిన సమయంలో దాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలో విద్యార్థుల చేత చేయించి చూపించారు. అగ్నిప్రమాదాల వల్ల స్పృహ కోల్పోయిన వారిని లేడర్ సహాయంతో ఏ విధంగా బహుళ అంతస్తులు నుండి కిందకు తీసుకురావాలో ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎఫ్ఈ బి రామచంద్రరావు, నాగేశ్వరరావు, శ్రీరాముల రెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువైన వెదురు దగ్ధం

ప్రజాశక్తి -మారేడుమిల్లి : మారేడుమిల్లి గురుకుల కళాశాల ఎదురుగా ఉన్న ఎపిఎఫ్‌డిసి కార్పొరేషన్‌కి చెందిన వెదురు డిపోలో నిల్వ ఉంచిన సుమారు లక్ష రూపాయలు విలువ చేసే వెదురు మంగళవారం అగ్నికి ఆహుతైంది. వేసవి నేపథ్యంలో కొండలు కాలుతున్న తరుణంలో మంటలు చెలరేగి సమీపంలో ఉన్న వెదురు లాటుపై పడి మంటలు వ్యాపించారు. వెంటనే సంబంధిత అధికారులు ఆగ్ని మాపకాక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటినా వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే పూర్తిగా కాలి పోయింది. సంఘటనపై కార్పొరేషన్ ఫారెస్టర్ వీరాంజనేయులును వివరణ కోరగా ప్రమాదవశాత్తు సమీప అడవిలో నుండి మంటలు చెలరేగి వెదురు లేటుపై పడటంతో ప్రమాదం సంభవించినట్లు చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బి.రామచంద్ర రావు, డ్రైవర్ జె.నాగేశ్వరరావు, కానిస్టేబుల్ సిహెచ్ శ్రీ రాములు రెడ్డి పాల్గొన్నారు.

దగ్ధమౌతున్న వెదురు

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

రంపచోడవరం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

ప్రజాశక్తి- రంపచోడవరం:త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు కావాల్సిన ఈవీఎంలు, వివి ప్యాడ్‌లు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 18 నుండి 25వ తేదీ వరకు కార్యాలయం పని రోజులలో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించుకోవచ్చని తెలిపారు. నామినేషన్ సమర్పించే అభ్యర్థితో ఐదుగురిని మాత్రమే కార్యాలయం లోపలికి అనుమతించబడు తుందని చెప్పారు. మే 13న ఉదయం 7 గంటల నుండి సాయంకాలం నాలుగు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు తెలియపరిచే విధంగా మండల స్థాయిలో అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. గుర్తేడు, పాతకోట పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు, వివి ప్యాడ్లు పోలింగ్ అనంతరం హెలికాప్టర్లో తీసుకొచ్చేందుకు ప్రతిపాదనలు సమర్పిస్తున్నట్లు తెలిపారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్

మండలాల వారీగా ఓటర్ల వివరాలు

అడ్డతీగల మండలంలోని పురుషులు 14,678 మంది, స్త్రీలు 16,152 మంది, థర్డ్ జెండర్ ఇద్దరు, మొత్తం 30,832 మంది, చింతూరులో పురుషులు 14347, స్త్రీలు 15,767, థర్డ్ జెండర్ ఇద్దరు, మొత్తం 30,116 మంది, దేవీపట్నంలో పురుషులు 9931, స్త్రీలు 11085, థర్డ్ జెండర్ ఇద్దరు, మొత్తం 21,018 మంది, గంగవరంలో పురుషులు 10412, స్త్రీలు 12511, థర్డ్ జెండర్ ఒక్కరు మొత్తం 21,923 మంది, కూనవరంలో పురుషులు 9,433, స్త్రీలు 10,904, థర్డ్ జెండర్ ముగ్గురు, మొత్తం 20,340 మంది, మారేడుమిల్లిలో పురుషులు 7221, స్త్రీలు 8023, మొత్తం 15,244 మంది, రంపచోడవరంలో పురుషులు 13,946, స్త్రీలు 15,898, మొత్తం 29,844 మంది, రాజవొమ్మంగిలో పురుషులు 15,508, స్త్రీలు 16,404, మొత్తం 31,912 మంది, విఆర్.పురంలో పురుషులు 9,491, స్త్రీలు 10,395 మంది, థర్డ్ జెండర్ ఒక్కరు, మొత్తం 19,887 మంది, వై.రామవరంలో పురుషులు 10,533, స్త్రీలు 11,697, థర్డ్ జెండర్ ఒక్కరు, మొత్తం 22,231 మంది, ఎటపాక మండలంలోని పురుషులు 16,038 మంది, స్త్రీలు 17,167 మంది, థర్డ్ జెండర్ నలుగురు మొత్తం 33,209 మంది, నియోజకవర్గం మొత్తం పురుషులు 1,31,537 మంది, స్త్రీలు 1,45,003 మంది, థర్డ్ జెండర్ 16 మంది, మొత్తం 2,76,556 మంది ఓటర్లు 11 మండలాలలో ఉన్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు.

జిసిసి సేల్స్‌మ్యాన్ నిర్లక్ష్యంతో అందని రేషన్

ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని సీలేరు సర్పంచ్ ఆరోపణ

జిసిసికి తాళం వేసి అదృశ్యమైన సేల్స్‌మ్యాన్

ప్రజాశక్తి -సీలేరు : ఎమ్‌డియు ఆపరేటర్‌కు పూర్తిస్థాయిలో రేషన్ బియ్యం, కందిపప్పు అప్పజెప్పకుండా జీకే వీధి మండలం సీలేరు జిసిసి సేల్స్‌మేన్ శ్రీనివాస్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీలేరు సర్పంచ్ దుర్గో మంగళవారం ఆరోపించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ఒకటో తేదీ నుంచి 17వ తేదీలోపు రేషన్ బియ్యం, సరుకులు పంపిణీ చేయవలసి ఉందన్నారు. ఇప్పటివరకు అలాట్మెంట్ ప్రకారం చూసుకుంటే 260 బస్తాలు రావాల్సి ఉండగా 230 బస్తాలు మాత్రమే ఎండియూకి సేల్స్ మెన్ అప్పగించారని మిగతా 30 బస్తాలు బియ్యం, 98 కేజీల కందిపప్పు ఇవ్వకుండా జిసిసి గొడౌన్‌కి తాళం వేసి కనిపించకుండా పోయారని తెలిపారు. జిసిసికి ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. దీనిపై పూర్తిస్థాయి విచారం చేసి సేల్స్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిసిసి స్టోర్ వద్ద నిరీక్షిస్తున్న ఎండియు వాహనం.

ఆన్‌లైన్ హాజరుతో ఉపాధి కూలీలకు ఇబ్బందులు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఐ నేతలు

ప్రజాశక్తి-ఎటపాక : ఉపాధి హామీ పనులు చేసే కూలీల హాజరును ఆన్‌లైన్ ద్వారా పంపించాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఆ సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎటపాక మండలం పట్టుచీర గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సీపీఐ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఐ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, ఎంపీటీసీ కంటే రాజు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో రోజు వారి హాజరు ఆన్లైన్ ద్వారా పంపించడం వల్ల సర్వర్ సమస్యతో హాజరు నమోదు కావడం లేదని తెలిపారు. దీంతో వారం రోజులు పనిచేసినా సాంకేతిక లోపంతో 3, లేదా 4 రోజులు మాత్రమే హాజరు ఆన్‌లైన్‌లో నమోదు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తి స్థాయిలో హాజరు నమోదు కాకపోవడం వల్ల హాజరు శాతం తగ్గి ఉపాధి కూలీలకు వేతనం తక్కువగా వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఏజెన్సీ ప్రాంతంలో ఆన్‌లైన్ హాజరు రద్దు చేసి మ్యాన్యువల్ హాజరు పునరుద్ధరించాలని కోరారు. పని ప్రదేశంలో ఎండ ఎక్కువగా ఉండటం వల్ల వడదెబ్బ తగిలే అవకాశం వుందని, టెంట్లు ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ చేయాలని కోరారు. జాబ్ కార్డులు లేవని వారు వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వరదబ్రహ్మం మూతయ్య, చంటి, వెంకటేష్ తెల్లం సత్యం, బద్దెపూడి బాబు, యేసులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : కాకినాడ ఏపీఎస్పీ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పనిచేస్తున్న రాజవొమ్మంగి గ్రామానికి చెందిన మిర్యాల పెంటారావు (42) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. పెంటారావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తమ నివాసంలో ఉంటున్నారు. మంగళవారం పెంటారావు పరిస్థితి విషమంగా ఉండడంతో అంబులెన్స్‌లో కాకినాడ జిజిహెచ్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెంటారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పెంటారావు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కానిస్టేబుల్ పెంటారావు

4జి పరికరాల పంపిణీలో నిర్లక్ష్యంపై నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 4జీ పరికరాల సరఫరాలో నిర్లక్ష్యంపై మంగళవారం భోజన విరామ సమయంలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిఇ సిహెచ్‌వి సాగర్ మాట్లాడుతూ, తయారీలో సమస్యలతో టిసిఎస్ సంస్థ నుంచి ఎంతోకాలంగా 4జీ పరికరాలు సరఫరా కావడం లేదన్నారు. ఈసాంకేతిక సమస్య అధిగమించడానికి నోకియా, జెడ్‌టిఇ వంటి సంస్థలను టిసిఎస్ సాయం కోరినట్లు వార్తలు వచ్చాయన్నారు. నెట్‌వర్క్ సమస్యతో ఇటీవల పది లక్షల మంది వినియోగదారులు బిఎస్ఎన్ఎల్‌ను విడిచిపెట్టారని, మరింత మంది వీడిపోయే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులకు 4జీ సేవలు అందించేందుకు తాత్కాలిక ఏర్పాటుగా వోడాఫోన్ ఐడియా నెట్‌వర్క్ వినియోగానికి బిఎస్ఎన్ఎల్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు. దీనిపై బిఎస్ఎన్ఎల్ స్పందించడం లేదని, కేంద్రం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ తాత్కాలిక ప్రధాన కార్యదర్శి జాన్ వర్గీస్ పాల్గొన్నారు.